



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 25-07-2024 సంపుటి : 06 సంచిక : 309 పేజీలు : 8 వెల : రూ 3-00

## అసెంబ్లీని వదిలి ధర్నాలు చేయడమా


**జగన్ హయాం ఆరాచకాలపైనా ఎగ్జిబిషన్ పెట్టాలి**
**హోంమంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా**



అమరావతి,జూలై24(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో జగన్ చేపట్టిన ధర్నాపై టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీకి ఎగ్గొట్టాలనే ధర్నాలు చేస్తున్నారన్నారు. ఢిల్లీ వెళ్ళి తుగ్లక్ రెడ్డి ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. జగన్‌కు రెడ్ బుక్ అంటే భయపడుతున్నారని... ఢిల్లీ వెళ్ళి అక్కడ కూడా రెడ్ బుక్ అని మాట్లాడుతున్నారని, ప్రతిపక్ష హోదా లేకపోయినా ప్రతిపక్ష సభ్యుడుగా హుందాగా వ్యవహరించాలని హోంమంత్రి వంగలపూడి అని అన్నారు. జగన్ ఢిల్లీలో ఫొటో ఎగ్జిబిషన్ పెట్టారని.. అందులో వైసీపీ హయాంలో జరిగినవి ఉన్నాయేమో చూసుకోవాలన్నారు. వైసీపీ హయాంలో జరిగిన ఘటనలు ఢిల్లీలో ఫొటో ఎగ్జిబిషన్ పెట్టాలి కదా జగన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో తమరు చేసిన ఘటనలు ఎగ్జిబిషన్ పెడితే ఢిల్లీ సగం సరిపోదంటూ హోంమంత్రి అనిత విమర్శలు గుప్పించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులకు నిరసనగా వైసీపీ అధినేత జగన్ ఢిల్లీలో ధర్నా చేపట్టిన సంగతి తెలిసిందే. వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కలిసి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాతో పాటు దాడులకు సంబంధించిన ఫోటోలు, వీడియోలతో ఫోటో గ్యాలరీ కూడా ప్రదర్శించారు.

# మద్యం అక్రమాలపై సీఐడీతో విచారణ

**లోతైన విచారణ తర్వాత ఇడికి సిఫార్స్**
**మద్య నిషేధం పేరుతో రాష్ట్రాన్ని దోచేశారు**
**సొంత బ్రాండ్లతో వైకాపా నేతల దోపిడీ**
**అసెంబ్లీలో ఎక్సైజ్ శాఖపై శ్వేతపత్రం విడుదల**
**నేరస్థుల పాలనతో పాలన భ్రష్టు పట్టిందన్న సిఎం చంద్రబాబు**



అమరావతి,జూలై24 ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మద్యం అక్రమాలపై సీఐడీతో విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. లోతైన విచారణ తర్వాత అవసరమైతే ఈ అంశాన్ని ఈడీకీ సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖపై బుధవారం శాసనసభలో శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'నేరస్థులు రాజకీయాల్లో ఉంటే రాజకీయాలు నేరాలమయమవుతాయి. నేరస్థుడే రాజకీయ నేత, సీఎం అయితే ఏం జరుగుతుందో గత ఐదేళ్లలో చూశాం. మేం విడుదల చేస్తోన్న 7 శ్వేతపత్రాలు చూస్తే రాష్ట్రం ఎంత నష్టపోయిందో తెలుస్తుందని చంద్రబాబు నాయుడు అన్నారు. మద్యపాన నిషేధం, లిక్కర్ ఔట్‌లెట్స్ తగ్గింపు అని చెప్పి.. అన్నీ మరిచారని విమర్శించారు. ప్రజలకు హామీ ఇచ్చామంటే అమలు చేసేదిగా ఉండాలి. మద్యం ధరలు పెంచుకుంటూ పోతే తాగేవాళ్లు తగ్గుతారని చెప్పారు. పొరుగురాష్ట్రాలతో పోలిస్తే ధరలు విపరీతంగా పెంచారు. అయినా మద్యం వినియోగం అమాంతం పెరిగిపోయింది. అయినా, ఏపీలో ఆదాయం తగ్గింది. ఎందుకంటే పెరిగిన ఆదాయం వైకాపా నేతల జేబుల్లోకి వెళ్లింది. దేశంలో దొరికే లిక్కర్ ఏపీలో దొరకలేదు. ఐదు టాప్ బ్రాండ్ల కంపెనీలను తరిమేశారు. చెల్లింపు ఆలస్యం చేయడం, ఆర్డర్‌లు ఇవ్వకపోవడం వంటి చర్యలతో వేధించారు. లోకల్ బ్రాండ్లు తీసుకొచ్చి షాపుల్లో విక్రయించారు. ఏవి అమ్మితే అవే తాగి పరిస్థితికి తెచ్చారు. మద్యం అనేది ఒక వ్యసనం. పేదవాడు శారీరకంగా కష్టపడి బాధలు మర్చిపోయేం దుకు తాగుతారు. వారి అలవాటును బలహీనంగా చేసుకొని దోచుకున్నారు. ప్రభుత్వంలోని ఇతర శాఖల్లో డబ్బును తీసుకొచ్చి ఎక్సైజ్ శాఖలో పెట్టుబడి పెట్టించారు. దీంతో ఆయా శాఖలకు దాదాపు రూ.250 కోట్ల నష్టం వాటిల్లింది. ఎక్సైజ్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలి. సరైన పాలసీలు తీసుకొచ్చి పేదలకు అందుబాటు ధరలో మద్యం లభించే విధంగా చూడటంతోపాటు డీఅడిక్షన్ సెంటర్లనూ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ఏ విధంగా ప్రక్షాళన చేయాలో శాసనసభ్యులు సలహాలు, సూచనలు ఇవ్వాలి. తప్పుచేసిన వాళ్లను కఠినంగా శిక్షిస్తేనే మళ్లీ తప్పు జరగకుండా ఉంటుంది. మంత్రులంతా వారి శాఖల్లోని అవకతవల్ని వెలికితీయాలి'అని చంద్రబాబు సూచించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్‌శాఖలో జరిగిన అవకతవకలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వేతపత్రం విడుదల చేశారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల మూడో రోజున బుధవారం ప్రశ్నోత్తరాల సమయం అనంతరం ఎక్సైజ్‌శాఖపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని ఆరోపించారు.పాలన ఎలా ఉండకూడదో గత ఐదేళ్లలో చూశామని అన్నారు. కొంతమంది అవసరాలకు తప్పుచేస్తారు. కొంతమంది అత్యాశతో చేస్తారు. కొంతమంది డబ్బుల ఉన్మాదంతో తప్పు చేస్తారని, దీనివల్లే వ్యవస్థలను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. ప్రజలకు హామీ ఇచ్చామంటే అమలు చేసేదిగా ఉండాలని అన్నారు. పరిపాలన ప్రజల కోసం చేయాలని , సంక్షేమం, అభివృద్ధి బేరీజు వేసుకుంటూ వెళ్లాలని సూచించారు. అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో మద్యం నిషేధిస్తామని హామీ ఇస్తునే విక్రయాలను విపరీతంగా పెంచారని ఆరోపించారు. క్వాలిటీ లేని మద్యం విక్రయించి కోట్లు దండుకున్నారని విమర్శించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకున్నారని చంద్రబాబు దుయ్యబట్టారు. 64 శాతం నేరాల శాతం పెరిగిందన్నారు. ఐదు టాప్ బ్రాండ్ల కంపెనీలను తరిమేశారని , లోకల్ బ్రాండ్ల కంపెనీలు విపరీతంగా పెంచారని ఆరోపించారు.

# ఎపిలో అరాచాక పాలనకు నిరసనగా జగన్ ధర్నా

**మద్దతు ఇచ్చిన ఇండియా కూటమి పార్టీలు**
**ధర్నాలో పాల్గొన్న అఖిలేశ్ యాదవ్**
**మద్దతు ఇచ్చిన పార్టీలకు జగన్ కృతజ్ఞతలు**






న్యూఢిల్లీ,జూలై24: ఏపీలో అరాచకాలు జరుగుతున్నాయం టూ..అందుకు నిరసనగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఆందోళనకు దిగారు. జగన్‌తో ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధర్నాలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై జంతర్ మంతర్ వద్ద ఫోటో ఎగ్జిబిషన్, వీడియో ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. వైసీపీ ఆందోళనకు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ మద్దతు తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అలాగే శివసేన (ఉద్ధవ్ థాకరే గ్రూప్) ఎంపీ సంజయ్ రౌత్ కూడా వైసీపీ ధర్నాకు మద్దతు పలికారు. సాయంత్రం ధర్నా ముగించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో వైసీపీ ఆందోళనకు హాజరైన ప్రతి ఒక్కరికి జగన్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే హాజరుకాక పోయినా మద్దతు తెలిపిన వాళ్లందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. జంతర్ మంతర్‌లో జరుగుతున్న వైసీపీ ఆందోళనకు ఇక్కడికి వచ్చి మద్దతు తెలపడమే కాకుండా రాష్ట్రంలో జరుగుతున్న వాస్తవాలను చూసి సంఘీభావం తెలిపిన పార్టీల నేతలకు కృతజ్ఞతలు అని చెప్పారు. ధర్నాలో భాగంగా ఏపీ సర్కార్‌పై జగన్ విరుచుకుపడ్డారు. ఏపీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు 30 వరకు హత్యలు జరిగాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న హేయమైన పనులపై జర్నలిస్టులు ఇకనైనా గళం విప్పాలని వైసీపీ అధినేత జగన్ పేర్కొన్నారు.కాగా.. గత రాత్రే ఢిల్లీకి చేరుకున్న జగన్.. జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. అలాగే మరో మూడు రోజుల పాటు ఢిల్లీలోనే వైసీపీ అధినేత ఉండనున్నారు. ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధానమంత్రి, పలువురు కేంద్రమంత్రుల అపాయింట్‌మెం ట్‌లను జగన్ కోరారు. వీరిని కలిసి రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలను కేంద్ర పెద్దలకు వివరించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.జగన్ ధర్నాకు జాతీయస్థాయిలో మద్దతు లభించింది.

# తల్లికి వందనం అందరికి వర్తింపు

**ఎపి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్**




అమరావతి,జూలై24( : ప్రభుత్వ-ప్రైవేటు బడుల విద్యార్థులందరికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపచేస్తామని ఎపి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. బుధవారం జరిగిన శాసనమండలిలో సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు లోకేశ్ సమాధానాలిచ్చారు. 'తల్లికి వందనం' పథకానికి విధివిధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ 'తల్లికి వందనం' ఇస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు బడుల విద్యార్థులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో 72 వేల మంది విద్యార్థులు తగ్గారని చెప్పారు. ఇతర రాష్టాల్లోని మంచి విద్యా విధానాలపై అధ్యయనం చేస్తామని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యాశాఖలో మంచి విధానాలను అమలు చేస్తామని లోకేశ్ వివరించారు.

## ల్యాండ్ టైటిటలింగ్ యాక్ట్‌తో భూములు లాక్కునే స్థితి

**టెక్నాలజీ ఉంటే రికార్డులు మార్చడం ఈజీ అయిపోయింది..**
**దీనిని రద్దు చేయాలన్న నిర్ణయం తీసుకున్నాం**
**అసెంబ్లీలో చట్టం రద్దుపై సిఎం చంద్రబాబు**

అమరావతి,జూలై24 ఏపీ అసెంబ్లీలో ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు బిల్లుపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆలోచన లేకుండా గత ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చింది అని విమర్శించారు. న్యాయవాదులు గత ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు.. రాష్ట్రంలో ఎక్కడ చూసినా భూ వివాదాలు పెరిగిపోయాయి.. గత ఐదేళ్లలో కుప్పంలో కూడా భూ వివాదాలుపై ఫిర్యాదులు వచ్చాయి.. ఏదైనా భూమిని 22 ఏ అని వేస్తే అది ప్రభుత్వ భూమి అయిపోతుంది.. ప్రభుత్వం ఒప్పుకుంటే మళ్లీ ప్రైవేటు భూమిగా మార్చేస్తారు.. నేరస్తుల దగ్గర టెక్నాలజీ ఉంటే రికార్డులు మార్చడం ఈజీ అయిపోయింది.. భూమి తరతరాలుగా వారసత్వం ప్రకారం వస్తోంది.. భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తాం రాజముద్ర వేస్తాం.. సీఎం బొమ్మ వేసి అప్పట్లో పాస్ పుస్తకాలు ఇచ్చారు.. భూ సర్వే ద్వారా వివాదాలు పెరిగాయి అందుకే హోల్డ్ చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ చట్టం వల్ల పౌరుల ఆస్తి మొత్తం లాగేసే పరిస్థితి ఉంది అని చంద్రబాబు అన్నారు. ఎంత మంది హైకోర్టుకు భూ వివాదాలపై వెళ్లగలుగుతారు.. గత చట్టం వల్ల ఎవ్వరైనా ఈ భూమి నాది అంటే అది ల్యాండ్ ట్రిబ్యూనల్ కు వెళ్లిపోతుంది.. తద్వారా ప్రైవేటు ఆస్తులు లాగేయాలని చూసారు..

# రాజ్యసభ నుంచి ప్రతిపక్ష నాయకుల వాకౌట్

**ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి ముప్పు అన్న ధన్కర్**




న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిన్న వివక్షపూరితమైన బడ్జెట్ ప్రవేశపెట్టారని నిరసన తెలుపుతూ ప్రతిపక్షనాయకులు నేడు(బుధవారం) రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.తాను రైతు నాయకులను ఆహ్వానించినప్పటికీ వారిని పార్లమెంటు ప్రాంగణంలోకి అనుమతించలేదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ఆరోపించారు. " వారు రైతులు కనుకే వారిని అనుమతించి ఉండకపోవచ్చు. మేమే ఇక వారిని వెళ్లి కలుస్తాము" అన్నారు. మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ " బడ్జెట్ కొందిరికే సంతోషాన్ని కలిగించింది. ఇద్దరికి తప్పించి మిగతా వారందరికీ శూన్య హస్తం చూపింది" అన్నారు.రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్కర్ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాక " వారి ప్రవర్తన సరిగా లేదు. అంతరాయాన్ని రాజకీయ వ్యూహంగా, ఆయుధంగా మలచుకుంటున్నారు. దీని వల్ల ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడ గలదు" అన్నారు. ఇదిలావుండగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ బడ్జెట్ లో తమిళనాడును నిర్లక్ష్యం చేసినందుకు జులై 27న జరుగనున్న 'నీతి ఆయోగ్ సమావేశం' ను బహిష్కరించనున్నానని ప్రకటించారు. తమిళనాడుతో పాటు కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ కూడా ఈ సమావేశాన్ని బహిష్కరించను న్నాయి. కాగా పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి మమతా బెనర్జీ " కేంద్ర బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా, రాజకీయ ఏకపక్షంగా ఉంది" అని విమర్శించారు. ప్రజల సంక్షేమానికి కాక కేవలం ఎన్ డిఏ మిత్రపక్షాలను సంతుష్ట పరిచేలాబడ్జెట్ ఉందని ఆమె అన్నారు.

## విజయ్‌సాయిరెడ్డికి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేస్తా : మదన్ మోహన్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు విజయ్‌సాయిరెడ్డి పై ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి భర్త మదన్ మోహన్ మానిపట్టి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేస్తున్న మరో వ్యక్తితో కలిసి విజయ్ సాయిరెడ్డి తన భార్య శాంతిని లోబర్చుకున్నారని, వారు ఆమెతో అక్రమంగా ఒక బిడ్డను కూడా కన్నారని ఆరోపించారు.తన భార్య ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నదని, ఆమెను విజయసాయిరెడ్డి లొంగ దీసుకున్నాడని మదన్ మోహన్ చెబుతున్నారు. వాళ్లు తన భార్యను లోబర్చుకోవడం మాత్రమే చేయలేదని, పెద్ద ఎత్తున చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాజేశారని ఆరోపించారు.

# సంపాదకీయం

గురువారం 25-07-2024

## అగ్నికి ఆజ్యం పోస్తున్న ప్రధాని

బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా రిజర్వేషన్ కోటాకు సంబంధించి తన నిర్ణయాన్ని సమర్థించుకోవడంలో తప్పు లేకపోవచ్చు. దానికి తగ్గ కారణాలను సంయమనంగా వివరించి ఉండాల్సింది. కానీ, దేశంలో చెలరేగిన నిరసనలపై ఆమె అగ్నికి ఆజ్యం పోసేలా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆందోళనకారులను రజాకార్లతో పోల్చారు. 1971లో బంగ్లాదేశ్‌లో స్వతంత్ర పోరాటం జరిగింది. ఆ సమయంలో స్వతంత్ర ఉద్యమాన్ని రజాకార్‌లు అణిచివేయాలని చూశారనే వాదన ఉంది. అందుకే ఆ పేరు వింటేనే బంగ్లాదేశ్ ప్రజలు మండిపడతుంటారు. అలాంటిది, తూర్పు పాకిస్థాన్‌కి చెందిన ఈ రజాకార్ దళంతో ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోల్చడమే ఇప్పుడు మరింత ఆగ్రహానికి కారణమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాని హసీనా చేసిన వ్యాఖ్యలు చూస్తే.. 'స్వాతంత్ర్య సమరయోధుల మనవళ్లకు కాకపోతే కోటా బెనిఫిట్స్ ఎవరికి దక్కాలి? అని హసీనా ఆందోళనకారులను ఉద్దేశించి ప్రశ్నించారు. రజాకార్ల మనవళ్లకు రిజర్వేషన్లు ఇవ్వాలా? అన్నారు. ఇక, నిరసనకారులు ప్రభుత్వం నిర్ణయానికి కట్టుబడి ఉండకపోతే, నేను ఏమీ చేయలేను అన్న ఆమె? నిరసనను కొనసాగించవచ్చునీ? నిరసనకారులు ఆస్తులను పాడు చేసినా లేదా పోలీసులపై దాడి చేసినా, చట్టం తన పని తాను చేస్తుందని? ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయలేదని వెల్లడించారు. ఇక్కడ, ప్రధాని హసీనా ఉద్దేశం. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి వారసుల ప్రయోజనాలను కాపాడటమే అయినప్పటికీ రజాకార్ అనే పదాన్ని వాడటం ప్రజల్లో ఆగ్రహానికి కారణం అయ్యింది. నిజానికి, బంగ్లాదేశ్‌లో ఉన్న రిజర్వేషన్ పాలసీ ప్రకారం, 10శాతం స్థానిక పరిపాలన జిల్లాల వారికి, 10శాతం మహిళలకు, 5శాతం మైనారిటీ తెగల వారికి, 1శాతం దివ్యాంగులకు ఇస్తున్నారు. దీనికి అదనంగా ఇప్పుడు 30 శాతం స్వతంత్ర సమరయోధుల కుటుంబాలకు చెందిన వ్యక్తులకు రిజర్వేషన్ కల్పిస్తూ హసీనా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఈ పద్ధతిని సంస్కరించి ప్రతిభ ఆధారంగా మొదటి, రెండో శ్రేణి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని విద్యార్థులతో పాటు ప్రజలు కూడా ఆందోళన చేపట్టారు. బంగ్లాదేశ్‌లోని ప్రధాన నగరాలైన ఢాకా, రాజ్‌షాహీ, ఖుల్నా, చత్తోగ్రాంలలో దీనిపై పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. దీనికి ఢాకా విశ్వవిద్యాలయ విద్యార్థులు నాయకత్వం వహిస్తుండగా రాను రానూ దేశవ్యాప్తంగా ఉన్న ఇతర యూనివర్సిటీలకు కూడా ఉద్యమం వ్యాపించింది. అయితే, విద్యార్థి కేంద్రంగా నడుస్తున్న ఈ ఉద్యమాన్ని రజాకార చర్యలతో పోల్చడం ఇప్పుడు మరింత ఉద్రిక్తతలకు దారి తీసింది. వెళితే.. బంగ్లాదేశ్ చరిత్రని రజాకార్‌లను విడదీసి చూడలేని పరిస్థితి. 1971లో బంగ్లాదేశ్ విముక్తి పోరాటం జరిగింది. పాకిస్థాన్ నుంచి విడిపోయి స్వాతంత్ర్యం కావాలని అందరూ బంగ్లాదేశ్ ప్రజలు ఉద్యమించారు. ఆ సమయంలోనే పాకిస్థాన్ ఆర్మీ ఈ ఉద్యమాన్ని అణిచివేసేందుకు పారామిలిటరీ ఫోర్స్‌ని రంగంలోకి దింపింది. ఈ దళాన్ని రజకార్ల దళం అంటారు. ఈ సైన్యంలో పాకిస్థాన్‌కి మద్దతుగా ఉన్న బెంగాలీలతో పాటు, ఉర్దూ మాట్లాడే బిహారీలు కూడా ఉన్నారు. అయితే, వీళ్లు చేయని దారుణమంటూ లేదని చరిత్ర పుస్తకాలు చెబుతున్నాయి. అత్యాచారాలు, మూక హత్యలు, దాడులతో ఉద్యమకారులపై విరుచుకుపడ్డారు రజాకార్లు. ఈ దాడుల్లో లక్షలాది మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత స్వాతంత్ర్యం సాధించినప్పటికీ.. ఈ ఉద్యమం మాత్రం చరిత్ర పుటల్లో చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. అయితే, ఆ ఉద్యమం సమయంలో అరాచకాలు చేసిన వాళ్లపై కఠిన చర్యలు తీసుకోడానికి వీలుగా 2010లో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ప్రత్యేంగా ఓ ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. కాగా.. ఇంత దారుణమైన చరిత్ర ఉన్న రజాకార్లతో ఆందోళనకారులు పోల్చడమేంటని కొందరు గట్టిగానే ప్రశ్నిస్తున్నారు. దేశవ్యాప్తంగా పరిస్థితులు అదుపు తప్పుతుంటే వాటిని సరి చేయాల్సింది పోయి ప్రభుత్వం ఇంకా రెచ్చగొడుతోందనే విమర్శలు వస్తున్నాయి. అయితే, దేశవ్యాప్తంగా ఇప్పటికే కర్ఫ్యూ విధించింది హసీనా ప్రభుత్వం. చాలా చోట్ల భద్రతా బలగాలు మోహరించి ఆందోళనకారులను కట్టడి చేస్తోంది. గొడవలు చేసే వాళ్లు కనిపిస్తే కాల్చి పారేయండి అంటూ ఆదేశాలు జారీ చేశారు. ఒక విధంగా, హసీనా ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ చారిత్రకంగా జరిగిన అన్యాయాలను పరిష్కరించడానికి ఆమె వ్యూహంలో భాగంగా ఉంది. ఆమె పార్టీ ఎన్నికల వాగ్దానాల్లో ఇది ప్రముఖంగానూ కనిపించింది. అయితే, సదరు ట్రిబ్యునల్ చాలా మంది వ్యక్తులను దోషులుగా నిర్ధారించింది. ఇందులో ప్రధానంగా ఇప్పుడు నిషేధించబడిన జమాత్-ఇ-ఇస్లామీ పార్టీకి చెందినవారు ఉన్నారు. 2019 డిసెంబర్‌లో, ప్రభుత్వం రజాకార్లుగా గుర్తించబడిన 10 వేల 789 మంది వ్యక్తుల జాబితాను ప్రచురించింది. ఇది ఈ రజాకార్ల సహకారులకు మొదటి అధికారిక గుర్తింపుగా గుర్తించబడింది. ఈ జాబితాలో ప్రముఖ వ్యక్తులు ఉన్నారు. భవిష్యత్ తరాలు వారి చర్యల చారిత్రక సందర్భాన్ని అర్థం చేసుకునేలా హసీనా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. అయితే, ఇందులో రాజకీయ కోణం ఉందనే వాదన కూడా బలంగానే వినిపిస్తోంది. ఇక, రాజకీయాల మాట అటుంచితే, ఈ రిజర్వేషన్ పాలసీ స్వతంత్ర సమరయోధుల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా సామాన్యులను ఉద్యోగ అవకాశాలకు దూరం చేస్తుందనే విమర్శలను ఎదుర్కుంటోంది. ఇక, బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్‌ల అంశం గతంలోనూ వివాదాస్పదమైంది. 1972లో ఇది అమల్లోకి తీసుకొచ్చిన సందర్భంలో?. విమర్శలు రావడంతో ఈ రిజర్వేషన్ పాలసీని 2018లో పక్కన పెట్టేశారు. అయితే, ఇటీవల ఐదో సారి ప్రధానిగా పీఠం ఎక్కిన తర్వాత ఈ రిజర్వేషన్‌లను అమల్లోకి తీసుకొస్తామని ప్రకటించారు. సుప్రీంకోర్టు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం మాత్రం పట్టుదల వదల్లేదు. కచ్చితంగా అమలు చేస్తామని తేల్చి చెప్పారు. దేశంలో అల్లర్లు మరింత ఉద్ధృతంగా మారాయి.

## 14 గంటల పని ప్రతిపాదనపై ఐటీ ఉద్యోగుల నిరసన : మంత్రి ప్రియాంక్ ఖర్గే కీలక వ్యాఖ్యలు




న్యూఢిల్లీ: ఐటీ ఉద్యోగుల పనివేళలు పెంచాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఉద్యోగులు భగ్గుమంటున్నారు. రోజుకు 14 గంటల పని ప్రతిపాదనకు నిరసనగా రాష్ట్ర ఐటీ ఉద్యోగులు చేపట్టిన సామూహిక ఈ-మెయిల్ క్యాంపెయిన్‌పై కర్నాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందించారు. ఐటీ పరిశ్రమల నుంచి వచ్చిన డిమాండ్లను కార్మిక శాఖ ముందుంచామని, దీనిపై చర్చలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఉద్యోగులు భయపడాల్సిన అవసరం లేదని, తనకు తెలిసినంతవరకూ ఈ నిబంధన అన్ని ఐటీ కంపెనీలు, ఐటీ ఆధారిత కంపెనీలకు వర్తించేది కాదని స్పష్టం చేశారు. బిల్లులో పొందుపరిచిన పూర్తి నిబంధనలు ఆన్‌లైన్ క్యాంపెయిన్ చేపట్టిన వారికి తెలుసో లేదో అని మంత్రి వ్యాఖ్యానించారు. కాగా ఉద్యోగుల పనివేళలు పెంచాలనే నిర్ణయం ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే తీసుకున్న నిర్ణయం కాదని, పనివేళలు పెంచాలని స్వయంగా ఐటీ కంపెనీలే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయని కార్మిక మంత్రి సంతోష్ లాడ్ తెలిపారు. ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు, బీపీఒల్లో పనిచేస్తున్న ఉద్యోగులు రోజుకు 12 గంటలకు పైగా పనిచేయడానికి వీలు కల్పించేలా నూతన బిల్లు అనుమతిస్తుంది. నూతన బిల్లు చట్టరూపం దాల్చితే రోజులో అత్యధికంగా 14 గంటల చొప్పున పనిచేసే వెసులుబాటు కలుగుతుంది. ఇప్పుడు ఓవర్‌టైంతో కలిపి గరిష్టంగా 10 గంటల వరకూ మాత్రమే ఐటీ ఉద్యోగులతో పనిచేయించే వెసులుబాటు ఉంది. కర్నాటక ప్రభుత్వ నూతన ప్రతిపాదనపై కార్మిక సంఘాల నుంచీ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

## ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టారు : సీపీఐ




న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ గురించి ప్రభుత్వం ఏం చెప్పినా మోదీ సర్కార్‌ను కాపాడుకునేందుకే ఈ బడ్జెట్ ముందుకొచ్చిందనేది వాస్తవమని సీపీఐ నేత అన్నీ రాజా అన్నారు. ప్రభుత్వాన్ని కాపాడుకునే క్రమంలోనే ఏపీకి, బిహార్‌కు మాత్రమే బడ్జెట్ కేటాయింపులు మెరుగ్గా దక్కాయని ఆమె పేర్కొన్నారు. వరదలు, వెనుకబాటుతనంతో సతమమయ్యే ఇతర రాష్ట్రాలకు అదే ప్రాతిపదికన కేటాయింపులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. సామాజిక రంగానికి కేటాయింపులు లేవని దుయ్యబట్టారు. మహిళా, శిశు సంక్షేమానికి జండర్ బడ్జెట్‌తో కలిపి రూ. 3 లక్షల కేటాయింపులు చేపట్టారని, ఈ కేటాయింపుల్లో ఎలాంటి పెంపూ లేదని అరకొరగా ఉన్నాయని అన్నీ రాజా అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బుధవారం ఉదయం సమావేశాలకు ముందు కూటమి పార్టీలకు చెందిన ఎంపీలంతా పార్లమెంట్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఇది అని ఆరోపించారు.

## ఉగ్రవాదులను జైలుకు లేదంటే నరకానికే పంపిస్తాం : కేంద్ర మంత్రి తీవ్ర హెచ్చరికలు



న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్ లో ఉగ్రదాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఉగ్రవాదులు ఘాతుకాలకు పాల్పడుతున్నారు. ఈ దాడుల్లో ఎంతో మంది జవాన్లు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో యాక్టివ్‌గా ఉన్న ఉగ్రవాదులను జైలుకు తరలిస్తామన్నారు. లేదనంటే నరకానికే పంపిస్తామని తీవ్రంగా హెచ్చరించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ బుధవారం రాజ్యసభలో మాట్లాడుతూ.. జమ్మూ ప్రాంతంలో ఉగ్రదాడుల అంశాన్ని ప్రస్తావించారు. 'జమ్మూ కశ్మీర్‌లో క్రియాశీలకంగా ఉన్న ఉగ్రవాదులను జైలుకు పంపుతాం. లేదంటే నరకానికే పంపిస్తాం' అని తీవ్రంగా హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని తమ ప్రభుత్వం ఏ మాత్రం సహించదని స్పష్టం చేశారు. ఉగ్రవాద కార్యకలాపాలను అంతం చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా జమ్మూ కశ్మీర్‌లో గత కొద్దిరోజుల్లోనే 28 మంది ఉగ్రవాదులు హతమైనట్లు చెప్పారు. ఈ దాడుల్లో కొందరు భద్రతా సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయారని మంత్రి సభకు వివరించారు. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకూ హిల్ స్టేట్‌లో భద్రతా బలగాలు దాదాపు 900 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు వెల్లడించారు. ఉగ్రదాడులపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై కూడా రాయ్ ఈ సందర్భంగా మండిపడ్డారు. 2004 ? 2014లో యూపీఏ ప్రభుత్వ హయాంలో జమ్మూకశ్మీర్‌లో 7,217 ఉగ్రవాద ఘటనలు జరిగాయని మంత్రి గుర్తు చేశారు. ఆ దాడుల్లో 2,829 మంది పౌరులు, భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. అయితే, బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ సంఖ్య 67 శాతానికి తగ్గినట్లు చెప్పారు. 2014 నుండి ఈ ఏడాది జూలై 21 వరకూ జమ్మూ ప్రాంతంలో 2,259 ఉగ్రవాద ఘటనలు జరిగినట్లు వివరించారు. ఇవి కూడా జరగకూడదని, దురదృష్టవశాత్తు ఉగ్రదాడులు జరిగాయన్నారు. దీనిపై ప్రతిపక్షాలు రాజకీయం చేయకూడదని పేర్కొన్నారు. ఇక ఎన్డీయే పాలనలో ఉగ్రవాద సంఘటనలు కూడా 69 శాతం తగ్గినట్లు వెల్లడించారు. జమ్మూ కశ్మీర్‌లో ప్రజలు ఇప్పుడు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని, భద్రతకు పూర్తి హామీ ఉందని సభలో వివరించారు.

## శాసనమండలిలో బిఆర్ఎస్ పక్ష నేతగా మధుసూదనాచారి

హైదరాబాద్,రాజకీయ కక్షతోనే ఎమ్మెల్సీ కవితను జైల్లో పెట్టారని సొంత బిడ్డ జైల్లో ఉంటే కన్నతండ్రిగా బాధ ఉండదా అని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేసీఆర్ అధ్యక్షతన భారాస శాసనసభాపక్ష సమావేశం జరిగింది. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్ వేదికగా జరిగిన సమావేశంలో ఉభయ సభల్లో ప్రస్తావించాల్సిన అంశాలపై మార్గనిర్దేశం చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసనసభాపక్ష సమావేశం జరగడం ఇదే తొలిసారి. నేను ఇప్పుడు అగ్నిపర్వతంలా ఉన్నా. పార్టీలో క్లిష్ట పరిస్థితులు ఏమీ లేవు. ఇంతకంటే ఇబ్బందికర పరిస్థితుల్లోనే తెలంగాణ సాధించా. నలుగురు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదా? ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఎమ్మెల్యేలు బాగా ఎదుగుతారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై పట్టు సాధించలేకపోయింది. పాలనపై దృష్టి పెట్టకుండా భారాసను అబాసుపాలు చేసే పనిలో ఉన్నారు. శాంతి భద్రతలు ఎందుకు అదుపుతప్పుతాయి? ఎక్కడో ఉన్న వారిని నేతలను చేస్తే.. పదవులు వచ్చాక పార్టీని వీడుతున్నారు.

## సాటి వ్యాపారస్తుడి జీవనం పై కొట్టడం సరికాదు..



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 24 డోన్ పట్టణంలో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్లో కూరగాయలు అమ్ముకుని జీవనాధారం సాగిస్తున్న బాలరంగడు వ్యాపార స్థలాన్ని ధ్వంసం చేసిన సాటి వ్యాపారస్తుడు కుమార్ బాలరంగడు వ్యాపారం నిర్వహిస్తున్న కట్టను తనకు ఇవ్వాలని దౌర్జన్యం చేసిన కుమార్ బాల రంగడు ఒప్పుకోకపోవడంతో మంగళవారం రాత్రి ఎవరూ లేని సమయంలో వ్యాపారం చేసుకునే కట్టను పగలగొట్టిన కుమార్ సంఘటనను గమనించిన వాచ్మెన్ బాలరంగడుకు విషయాన్ని తెలియజేయడంతో బుధవారం మున్సిపల్ కమిషనర్ జయరాంకు దృష్టికి తీసుకువెళ్లిన బాధితుడుసంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మునిసిపల్ కమిషనర్ ఒక వ్యాపారస్తుని జీవనంపై కొట్టడం ఇంకో వ్యాపారస్తునికి సరికాదన్న స్థానికులుఒకే మనిషి సుత్తితో కొద్ది సమయం లోనే కట్టను పగలగొట్టడంతో నాణ్యతలేని నిర్మాణాలు చేపట్టారని పురపాలక సంఘం వారిపై దుయ్యబట్టిన స్థానికులు.

## కేంద్ర బడ్జెట్ లో ఆంధ్ర సముచిత స్థానం....సుబ్బారెడ్డి



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి: -జూలై 24 మంగళవారం కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు కేంద్ర ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు చొరవతో ఆంధ్ర ప్రదేశ్ కుపెద్దఎత్తునఅమరావతి నిర్మాణానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.15 వేల కోట్లు రూపాయలు పోలవరం ప్రాజెక్టు పూర్తి నిధులు ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం సంతోషకరమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ లో మౌలిక వసతులకు నిధులు ఇస్తామని, రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం అభినందనీయమని అన్నారు ఇదంతా మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కృషి వల్లే సాధ్యమైందని అన్నారు. రాష్ట్ర అవసరాలను గుర్తించి రాజధాని, పోలవరం ,పారిశ్రామిక రంగాలపై దృష్టి సాధించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి , కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కి ధన్యవాదాలు.

## కుష్టు వ్యాధి పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రుద్రవరం.జులై24 :కుష్టు వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా లెప్రసీ మరియు ఎయిడ్స్, అదనపు ఆరోగ్యశాఖ అధికారి శారదాబాయి తెలిపారు. మండల పరిధిలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న కుష్టు వ్యాధి సర్వేను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అందించే వైద్య సేవలపై సిబ్బందిని ఆరా తీసి రికార్డుల నిర్వహణ రోగులకు అందించే వైద్య సేవలు అలాగే కుష్టు వ్యాధి బారిన పడిన వారికి అందించాల్సిన వైద్య సేవలపై అధికారులు సిబ్బందికి తగిన సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బాబు, ఎంపీ హెచ్ఈ ఓ నాగ ప్రసాద్, హెల్త్ సూపర్వైజర్ భూలక్ష్మి, ఏఎన్ఎం రాములమ్మ, ఆశా కార్యకర్త సుధారాణి, వాలంటీర్ లక్ష్మి చెన్నయ్య పాల్గొన్నారు.

### ఫోక్సో కేసులో నిందితుడుకి 20 ఏళ్ల కఠినకారాగార శిక్ష

కాచిగూడ ఫోక్సో కేసులో నిందితుడుగా ఉన్న ఓ డ్రైవర్ కు 20 ఏళ్ల కఠినకారాగార శిక్ష పడింది. హైదరాబాద్ కాచిగూడ రత్న నగర్ లో నివాసం ఉంటున్న మల్పారాజుల ప్రవీణ్ (28) వృత్తి రీత్యా డ్రైవర్. 2017 లో ప్రవీణ్ కుమార్ ఓ మైనర్ బాలిక పై అత్యాచారానికి ఒడిగట్టాడు. అప్పుడు కాచిగూడ పోలీసులు ప్రవీణ్ పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పూర్తి విచారణ అనంతరం ఈ కేసు తీర్పు వెలుబడింది. నాంపల్లి హకా భవన్ లోనో ఫోక్సో స్పెషల్ సెషన్స్ జడ్జ్ పి పుష లత , నిందితుడి ప్రవీణ్ కు ఈ శిక్ష విధించారు.

# ఇక పోలవరం పరుగులే...




ఏలూరు, జూలై 24, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరగడంతో కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా పోలవరం నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావిస్తోంది. విభజన హామీల అమలు విషయంలో తరచూ విమర్శల్ని ఎదుర్కోవాల్సి వస్తుండటంతో బీజేపీ పోలవరం ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని భావిస్తోంది.2014-24 మధ్య కాలంలో జరిగిన రకరకాల పరిణామాల నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్టు తెలుస్తోంది.పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయడానికి సహకరించేందుకు కేంద్రం సుముఖత తెలిపింది. సోమవారం ఏపీ ప్రతినిధి బృందంతో చర్చల తర్వాత నిధుల విడుదలపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సుముఖత వ్యక్తం చేశారు.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం పోలవరం ప్రాజెక్టులో ప్రస్తుతం మిగిలిన ఉన్న పని ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ మాత్రమే. ఈసిఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణం చేపట్టడానికి సాంకేతికంగా అవరోధాలు ఎదురయ్యాయి.2019-20 మధ్య కాలంలో వరదల్లో డయాఫ్రం వాల్ దెబ్బతింది. గోదావరి ఉపరితలం నుంచి భూమి లోపల రాతి పొరలు తగిలే వరకు తవ్వుకుంటూ నిర్మించిన డయాఫ్రం వాల్ పలు చోట్ల వరద ఉధృతికి కొట్టుకుపోయింది. డయాఫ్రం వాల్‌కు రెండు వైపులా కాఫర్ డ్యామ్‌లను నిర్మించినా కొన్ని చోట్ల గ్యాప్‌లు ఉండటంతో డయాఫ్రం వాల్ పూర్తిగా దెబ్బతింది.దీంతో ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు నిలిచిపోయాయి. 2019-22 వరకు వరుసగా వచ్చిన వరదలతో పాటు అంతకు ముందు 2016-19 మధ్య వచ్చిన వరదల్లో కూడా ఇది దెబ్బతిని ఉంటుందనే వాదనలు ఉన్నాయి.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం నిర్మాణ పనుల నుంచి నవయుగ సంస్థను తప్పించి రివర్స్ టెండరింగ్‌లో మేఘాకు పనులు అప్పగించారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలై టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలవరం నిర్మాణ పనులపై ఏం జరుగుతుందనే ఆసక్తి కూడా అందరిలో ఉంది.కాంట్రాక్టు సంస్థ విషయంలో వైసీపీ మాదిరే టీడీపీ వ్యవహరిస్తుందా అనే అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలోనే స్పష్టత ఇచ్చారు ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయడమే తమ ముందున్న లక్ష్యమని అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పారు.ప్రస్తుతం పోలవరంలో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణమే మిగిలి ఉన్నట్టు తెలుస్తోంది. అందులో డయాఫ్రం వాల్ నిర్మాణం జర్మనీ కి చెందిన బావర్ కంపెనీ నిర్మిస్తుంది. ప్రాజెక్టు నిర్మాణంలో ఏ కంపెనీ వచ్చినా డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని ఆ కంపెనీ చేయాల్సి ఉంటుంది. 2015-16లో కూడా డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు బావర్ కంపెనీ చేపట్టింది. ఇప్పుడు కూడా వాళ్ళే చేయాల్సి ఉంటుంది. డయాఫ్రం వాల్ టెక్నాలజీ పేటెంట్ బావర్ కంపెనీ వద్ద మాత్రమే ఉంది. దీంతో బావర్ కంపెనీ తోనే మళ్లీ పనులు చేయించాల్సి ఉంటుంది. ఆ పనిని బావర్‌కు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చిపూర్తి చేయించాల్సి ఉంటుంది. మిగతా రాక్ ఫిల్లింగ్ వర్క్ మాత్రం కాంట్రాక్టర్ చేయాల్సి ఉంటంది.మరో వైపు డయాఫ్రం వాల్ కు సంబందించిన కొత్త డిజైన్లు రావాల్సి ఉంది. కొత్త గోడను కట్టాలా పాత దానికి రిపేర్లు చేయాలా అన్నది కూడా తేల్చాల్సి ఉంది. వాటిపై కేంద్రం స్పష్టత వచ్చాకే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పోలవరం నిర్మాణ పనుల్లో ఎలాంటి మౌలిక మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తోంది.కేంద్ర ప్రభుత్వం కూడా పోలవరం విషయంలో న్యాయవివాదాలు, సాంకేతిక సమస్యలు, కాంట్రాక్టర్ల సమస్యలు వంటి కారణాలతో ప్రాజెక్టును జాప్యం చేయడానికి అంగీకరించకపోవచ్చని తెలుస్తోంది. జాతీయ ప్రాజెక్టుగా నిర్మిస్తున్న పోలవరం విషయంలో గతంలో జరిగిన పొరపాట్లకు తావిచ్చేందుకు బీజేపీ సుముఖంగా లేనట్టు తెలుస్తోంది. సోమవారం ఏపీ ప్రతినిధులకు ఇదే విషయాన్ని కేంద్ర జలశక్తి మంత్రి సూచించినట్టు సమా?చారం.పోలవరం తొలిదశ పనుల కోసం రూ.12,157 కోట్ల విడుదలకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్టు ఏపీ ప్రభుత్వ ప్రతినిధులు తెలిపారు. నిధుల అంశాన్ని కేంద్ర క్యాబినెట్ ముందుకు తీసుకెళ్లనున్నారు. పోలవరం తొలిదశలో 41.15 మీటర్ల వరకు నీళ్లు నిల్వ చేసేందుకు వీలుగా ప్రాజెక్టు నిర్మాణం, పునరావాస పనుల కోసం రూ.12,157 కోట్లను విడుదల చేయాలని ఏపీ ప్రభుత్వ ప్రతినిధి బృందం సోమవారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివా సవర్మల నేతృత్వంలో ఏపీ ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఎంపీలు.. ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ప్రాజెక్టు పరి స్థితిని వివరిస్తూ వినతిపత్రం ఇచ్చారు.దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్టు మంత్రి నిమ్మల తెలిపారుపోలవరం జాతీయ ప్రాజెక్టు కాబట్టి ఎన్డీయే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, చంద్రబాబు సారథ్యంలో పోలవరం నిర్మాణ పనుల్ని పూర్తి చేయడానికి సాయం చేస్తామని హామీ ఇచ్చారని మంత్రి రామానాయుడు చెప్పారు. పోలవరం ప్రాజెక్టును వైసీపీ నిర్లక్ష్యం చేసిందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆరోపించారు.2024 జూన్ వరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై రూ. 21,898.28 కోట్లు ఖర్చు చేయగా అందులో రూ. 17,167.57 కోట్లను ప్రాజెక్టుకు జాతీయ హోదా వచ్చిన తర్వాత ఖర్చు చేశారు. ఇందులో ఇప్పటివరకు రూ.15,146.27 కోట్లను కేంద్ర ప్రభుత్వం తిరిగి చెల్లించింది. మరో రూ. 2021.30 కోట్ల రావాల్సి ఉంది. వాటిని విడుదల చేయాలని కోరారు. తొలి దశ పూర్తి చేయడానికి రూ.12వేల కోట్లు కావాలని కోరగా కేంద్రం సానుకూలంగా ఉందని ఏపీ మంత్రులు చెబుతున్నారు.

# నిప్పుల్లో నిజాలు...

తిరుపతి, జూలై 23, మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో చెలరేగిన మంటలు? రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించాయి. ఓ వైపు అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు పూనుకున్న ప్రభుత్వం? శ్వేతాస్త్రాలు సంధించేందుకు సిద్ధమవుతుండగా, మదనపల్లెలో కీలక ఫైళ్లు కాలిపోయాయనే సమాచారం ప్రభుత్వాన్ని అలెర్ట్ చేసింది. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన 980 ఎకరాల అనాధీన భూములు పట్టా భూములుగా మారిన వ్యవహారంపై దర్యాప్తు జరుగుతుండగా, ఈ అగ్ని ప్రమాదం జరగడంతో ప్రభుత్వానికి షాకిచ్చినట్లైందంటున్నారు. అధికారంలోకి వచ్చి 40 రోజుల తర్వాత కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో ఇలాంటి ఘటనలు జరగడం?. అదీ సీఎం చంద్రబాబు సొంత జిల్లాలోనే అవ్వడంతో ప్రభుత్వం ఆగమేఘాలపై ఉన్నతాధికారులను పంపాల్సి వచ్చింది.మదనపల్లె సబ్ కలెక్టర్‌గా కొత్తగా నియమితులైన అధికారి మేఘ స్వరూప్ బాధ్యతలు తీసుకోడానికి కొన్ని గంటల ముందు? మంటలు చెలరేగడమే సందేహాలకు తావిస్తోంది. సెలవు రోజున? ఓ ప్రభుత్వ ఉద్యోగి అర్ధరాత్రి వరకు కార్యాలయంలో ఉండటం? అతడు వెళ్లిన కొద్ది సేపటికి కార్యాలయం బుగ్గి పాలవడం?. అందునా అతుడు వైసీపీ కీలక నేతకు పట్టున ప్రాంతానికి చెందిన వాడు కావడంతో ఎన్నెన్నో అనుమానాలకు తావిస్తోంది?. ఈ ప్రమాదం ఒక్కటే కాదు గత కొద్దిరోజులుగా రాష్ట్రంలో ప్రభుత్వ ఫైళ్ల దహనమవుతూనే ఉన్నాయి. ఈ చర్యల వెనుక ఏమైనా కుట్ర ఉందా? అనే కోణంలో ప్రభుత్వం ఆరా తీస్తోంది.ఇప్పుడు మదనపల్లె? కొద్దిరోజుల ముందు విజయవాడలోని కాలుష్యనియంత్రణ మండలి ఫైళ్లు? అంతకు కొద్దిరోజుల క్రితం నీటిపారుదలశాఖ ప్రధాన కార్యాలయంలో ఫైళ్లు కాలిపోయాయి. ఇక ఎన్నికల ఫలితాలకు ముందు తాడేపల్లిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫైళ్లు కాల్చివేశారు.అమరావతి ఔటర్, ఇన్నర్‌రింగ్ కేసులో హెరిటేజ్ నుంచి స్వాధీనం చేసుకున్న ఫైళ్లు గుట్టుగా కాల్చివేయడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఇక ఇప్పుడు మదనపల్లెలో కూడా విలువైన భూములను ఉమ్మడి చిత్తూరు జిల్లాలకు చెందిన వైసీపీ కీలక నేత దక్కించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో పలువురు ఐఏఎస్ అధికారుల పాత్రపైనా ప్రభుత్వం విచారణ జరుపుతోంది. ఇలాంటి సమయంలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరగడమే అనేక అనుమానాలకు దారితీస్తోంది.మదనపల్లె వ్యవహారంలో అనుమానాలు ఎదుర్కొంటున్న నేత గత ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించారు. రాయలసీమలో ఆయన సమాంతర ప్రభుత్వాన్ని నడిపినట్లు విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఆ నేత కుటుంబ సభ్యులు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ప్రభుత్వానికి వరుసగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన ఫైళ్లే కాలిపోతున్నాయని ప్రభుత్వ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. దీంతో ప్రమాదాలపై అనుమానాలు ఎక్కువవుతున్నాయి. ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగుతున్నాయా? పథకం ప్రకారం నిప్పు రాజేస్తున్నారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.ఒక్క మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో చెలరేగిన అగ్ని కీలలే కాదు? గతంలో విజయవాడలో కాలుష్య నియంత్రణ మండలి ఫైళ్లు కాల్చివేత కూడా అనేక సందేహాలకు దారితీసింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన సీఐడీ పలువురు పాత్రధారులను అరెస్టు చేసింది. సూత్రధారుల కోసం కూపీ లాగుతోంది?. ఇదే క్రమంలో మరో ప్రభుత్వ కార్యాలయంలో మంటల చలరేగడమే ప్రభుత్వానికి చాలెంజింగ్‌గా మారింది.రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాల్లో అగ్ని ప్రమాదాలు? ఫైళ్లు కాల్చివేత ఓవైపు కొనసాగుతుండగా, ఇదే సమయంలో కొన్ని కీలక ఫైళ్లు అదృశ్యమయ్యాయనే సమాచారం ప్రభుత్వం సేకరించిందని తెలుస్తోంది. ఇప్పటికే చాలా ఫైళ్లు మాయం చేశారని, కంప్యూటర్లలో ఉన్న సమాచారాన్ని డిలీట్ చేశారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సాంకేతిక నిపుణుల సహకారంతో డిలీట్ చేసిన ఫైళ్లు రికవరీ చేస్తుండటం వల్ల? ఏకంగా కీలక సమాచారం ఉన్న కాగితాలను కాల్చేయాలనే నిర్ణయానికి వచ్చారని అధికార పార్టీ ఆరోపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో అగ్ని కీలలు రాష్ట్రంలో కలకలం రేపాయి.ఎన్నడూ లేనట్లు? సమాచారం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు రంగంలోకి దిగి నిమిష.. నిమిషానికి ఏం జరిగిందో తెలుసుకోవడం చూస్తే?. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకున్నట్లే కనిపిస్తోందంటున్నారు. ఇక డీజీపీ ద్వారకా తిరుమలరావును హుటాహుటిన మదనపల్లె పంపడం కూడా ప్రభుత్వం గట్టి యాక్షన్ తీసుకునే అవకాశాలున్నాయనే సంకేతాలు పంపుతోందంటున్నారు. మొత్తానికి మదనపల్లె సబ్ కలెక్టరేట్ కేంద్రంగా రేగిన కాక? రాష్ట్ర రాజకీయాల్లో భారీ కుదుపునకు దారితీసే అవకాశాలున్నట్లు చెబుతున్నారు.

## ఆర్డీవో కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని పరిశీలించిన స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సిసోడియా

మదనపల్లె,మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని స్పెషల్ చీఫ్ సెక్రెటరీ (రెవెన్యూ) సిసోడియా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ట్రాన్స్కో జేయండీ చక్రధర్ బాబు, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, తదితరులు స్పెషల్ సిఎస్ తో పాటు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ (రెవెన్యూ) సిసోడియా మాట్లాడుతూ అగ్ని ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై చాలా సీరియస్ గా ఉందని, అగ్ని ప్రమాదానికి గల కారణాలను త్వరితగతిన గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆదివారం అర్ధరాత్రి ఎన్ని గంటలకు అగ్నిప్రమాదం సంభవించింది. ఆ సమయంలో కార్యాలయంలో ఎవరెవరు ఉన్నారు. షార్ట్ సర్క్యూట్ ఎలా జరిగింది. ఇన్వెటర్లు ఎక్కడెక్కడ ఉన్నాయి. సబ్ కలెక్టర్ చాంబర్ ఎక్కడ. వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన 22 (ఎ ) విభాగానికి సంబంధించిన గదిలోని కాలిపోయిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం చుట్టు ప్రక్కల మరియు ఆర్డీవో కార్యాలయపు వెలుపలి వైపు చుట్టూ ప్రహరీ గోడను పరిశీలించడం

## బద్వేలు ప్రాంత ప్రజలకు రైలు కూత వినిపించేనా.

### నాలుగు దశాబ్దాలుగా ప్రజల కల ఇప్పటికీ నెరవేర లేదు
### ఈ విషయంపై ప్రజాప్రతినిధుల మౌనం


బద్వేలు,బద్వేల్ మీదుగా కొత్త రైల్వే లైన్ ప్రసక్తి లేకుండా పోయింది గత నాలుగు దశాబ్దాలుగా పైబడి బద్వేల్ మీదుగా రైలు మార్గం వస్తుందని ప్రజలు ఎంతో ఆశపడ్డారు ప్రజలకు ఎదురుచూపులే తప్ప వారి ఆశ ఇప్పటికీ నెరవేరలేదు రైలు మార్గం అవుతుందని పెట్టుకున్న ప్రజల నమ్మకం క్రమేపి సన్నగిల్లుతుంది గతంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు భాకరాపేట - గిద్దలూరు వరకు బద్వేలు మీదుగా రైల్వే మార్గం ప్రతిపాదనలు చేశారు ఆ ప్రతిపాదన కేవలం ప్రకటనలకే పరిమితం అయింది దీంతో రైల్వే లైన్ పరిస్థితి ఇప్పటికీ ఎటు తేలడం లేదు బిజెపి పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి దాదాపు పది సంవత్సరాలు అవుతుంది ఈ పది సంవత్సరాల కాలంలో బద్వేలు కు రైలు మార్గం ప్రస్తావన ఇప్పటికీ తీసుకురాలేదు రైలు మార్గం కోసం సర్వేలైతే గతంలో చేశారుగాని ఆ తర్వాత ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి ఈ రైలు మార్గం వెళ్లే ప్రాంతాలవారు కొత్త రైల్వే మార్గం ఎప్పుడు వస్తుందో అని ఎదురుచూస్తున్నారు తమ ప్రాంతం మీదుగా రైలు వస్తే రాకపోకలు ఆర్థిక వ్యాపార రంగాల పరంగా అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్న వారి ఆశలు అడియాశలు అయ్యాయి గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం ఉన్న రోజులు రైల్వే బడ్జెట్లో కేవలం లక్షల రూపాయలు మాత్రమే ఈ మార్గానికి సంబంధించి నిధులు కేటాయిస్తూ వచ్చారు ప్రవేట్ సంస్థలకు సర్వే పనులు అప్పగించి కొంతవరకు సర్వే చేయించినట్లు గతంలో రైల్వే వర్గాలు ప్రకటించాయి భాకరాపేట - గిద్దలూరు రైల్వే మార్గం ఏర్పాటయితే బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని బద్వేలు నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని మండలాల గుండా వెళుతుంది దీనివల్ల భాకరాపేట సిద్ధవటం అట్లూరు మీదుగా బద్వేలు బి కోడూరు పోరుమామిళ్ల కాశి నాయన మండలాలను తాకుతూ కలసపాడు మండలం నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు వరకు రైల్వే లైన్ వెళుతుందని ప్రజలు ఆశలు పెట్టుకున్నారు చీని కాయలను చెన్నై తో పాటు బెంగళూరు ముంబై నాగపూర్ తదితర నగరాలకు రవాణా అనువుగా ఉంటుందని రైతులు ఇప్పటికీ అంటున్నారు అయితే ఈ రైల్వే లైను వస్తే బద్వేలు నియోజకవర్గంలోని ముఖ్యంగా అట్లూరు మండలంలో చీని తోటలు అధికంగా ఉన్నాయి ఇక్కడ రైతులు రైల్వే మార్గంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రయోజనం మాత్రం లేకుండా పోయింది గతంలో ఈ లైన్ ఏర్పాటు చేసేందుకు యూపీఏ ప్రభుత్వం ఎంతో ఆసక్తి చూపింది

## 20 ఏళ్ల తర్వాత ఏపీకి మంచి బడ్జెట్...

విజయవాడ, జూలై 23, కేంద్ర బడ్జెట్ ప్రకటన తర్వాత దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ , బీహార్ గురించి చర్చ జరుగుతోంది. ఈ రెండు రాష్ట్రాలకు ఎక్కువ నిధులు కేటాయించారని అంటున్నారు. బీహార్ గురించి పక్కన పెడితే ఈ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేకమే. ఎన్నో సమస్యల్లో ఉన్న రాష్ట్రానికి ఊపిరి పోసేలా నిధుల కేటాయింపు ఉంది. గత ఇరవై ఏళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ అనే పదం కేంద్ర బడ్జెట్‌లో వినిపించేది కాదు. చివరికి రాష్ట్ర విభజన తర్వాత కూడా. ఎందుకిలా అంటే.. అది రాష్ట్రాల బడ్జెట్ కాదని.. కేంద్ర బడ్జెట్ అని.. వాదించేవారు. అయితే ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు ప్రత్యేకమైన కేటాయింపులు చేసేవారు. ఆ జాబితాలో ఎప్పుడూ లేదు. ఇప్పుడు ఎన్నికలు లేకపోయినా ఆంధ్రప్రదేశ్ పేరు మార్మోగిపోయింది. ఎప్పుడో వాజ్ పేయి హయాంలో చంద్రబాబు ఢిల్లీలో చక్రం తిప్పినప్పుడు ఏపీకి కేంద్ర నిధులు ఎక్కువగా వచ్చేవి. మళ్లీ ఇప్పుడే సాధ్యమయ్యాయి. కేంద్రంలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ పదవుల్ని త్యాగం చేసి అయినా సరే మంచి ప్యాకేజీని రాష్ట్రం కోసం సాధించగలిగిందని అనుకోవచ్చు. దాదాపుగా ఊపిరి పోయిన అమరావతికి కేంద్రం నిధుల ఆక్సిజన్ ఇచ్చింది. అమరావతికి మళ్లీ ఎదగడానికి కేంద్రం నిధులు ప్రకటించింది. ఏకంగా పదిహేను వేల కోట్ల రూపాయలు సమకూరుస్తామని ప్రకటించిది. అయితే కేంద్ర నగదు బదిలీ చేయదని.. అప్పు ఇస్తుందని కొంత మంది వాదిస్తున్నారు. అది గ్రాంట్ అయినా.. అప్పు అయినా.. నేరుగా అలోకేట్ చేసినా.. సరే అమరావతికి పదిహేను వేల కోట్ల అందబోతున్నాయి. ఏ రూపంలో ఇచ్చినా కేంద్రమే అత్యధికంగా తిరిగి చెల్లిస్తుంది. విభజన చట్టంలో భాగంగా సాయం చేస్తున్నామని నిర్మలా సీతారామన్ చాలా స్పష్టంగా చెప్పారు. అమరావతికి ఎప్పుడో పునాదులు పడ్డాయి. కాబట్టి అక్కడ్నుంచి నిర్మించడమే మిగిలింది. నిధుల సమస్య ఉండదు. ఇక అమరావతి పరుగులు పెట్టనుంది. పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టు. నిధులన్నీ పూర్తిగా నాబార్డు ద్వారా రీఎంబర్స్ చేస్తారు. అయితే కొన్ని విషయాల్లో కేంద్రం సహకారం అవసరం. బడ్జెట్‌లో చెప్పిన దాని ప్రకారం పోలవరం వల్ల దేశానికి ఆహార భద్రత పోలవరం ప్రాజెక్టు వల్ల వస్తుంది. ఈ విషయంలో కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించబోతోంది. ఐదేళ్లుగా నిర్మాణం ఆగిపోవడం వల్ల పోలవరం ప్రాజెక్టుకు అనేక సమస్యలు వచ్చాయి. వాటన్నింటినీ క్లియర్ చేసి.. వరద తగ్గగానే నిర్మాణాలు ప్రారంభించేందుకు చంద్రబాబు సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేసుకునే చాన్స్ ఉంది. హైదరాబాద్ - బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కూడా ప్రత్యేక నిధులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. ఈ రెండు కారిడార్లలో పారిశ్రామిక మౌలిక సదుపాయాలు కల్పిస్తే పారిశ్రామికంగా ఏపీ తిరుగులేని విధంగా ఎదిగే అవకాశం ఉంటుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సాయం చేస్తామని నిర్మలా సీతారామన్ చెప్పారు. విభజన చట్టంలో పొందుపరిచినట్లుగా వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక సాయం అందించడం సహా రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ఎలా చూసినా.. గత ఇరవై ఏళ్ల కాలంలో బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ అనే ప్రస్తావనే వినిపించేది కాదు.కానీ ఈ సారి మారుమోగిపోయింది. ఇది ఏపీకి మంచి రోజులు తెచ్చిందని అనుకోవచ్చు.

## బడ్జెట్ పై నోరెత్తని వైసీపీ....

విజయవాడ, జూలై 24,కేంద్ర బడ్జెట్ లో ఏపీకి సముచిత స్థానం దక్కింది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం పెద్దపీట వేసింది. ఏకంగా 15 వేల కోట్ల రూపాయలు కేటాయించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సైతం సాయం చేస్తామని ప్రకటించింది. వెనుకబడిన జిల్లాలకు నిధులు సమకూర్చుతామని కూడా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీకి బడ్జెట్లో పెద్దపీట వేశారు. తోటి తెలుగు రాష్ట్రం తెలంగాణకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో అక్కడి అధికారపక్షం, విపక్షం కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నాయి. దాయాది రాష్ట్రానికి బడ్జెట్లో కేటాయింపులపై ఆహ్వానిస్తున్నాయి. కానీ ఏపీలో మాత్రం విపక్షంగా ఉన్న వైసిపి ఇంతవరకు స్పందించలేదు.వైసిపి స్పందించడానికి రెండు రకాల ఇబ్బందులు ఉన్నాయి. కేంద్ర బడ్జెట్ పై ప్రతికూల వ్యాఖ్యలు చేస్తే.. కేంద్ర ప్రభుత్వానికి ఆగ్రహం రావడం ఖాయం. అసలే ఘోర పరాజయంతో వైసీపీ పరిస్థితి ఏమంత ఆశాజనకంగా లేదు. కచ్చితంగా కేసులు చుట్టుముడతాయి. పాత కేసులు తెరపైకి వస్తాయి. ఇటువంటి సమయంలో కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. ఏమాత్రం ప్రతికూల వ్యాఖ్యలు చేసినా జగన్ ఇబ్బందికర పరిణామాలు ఎదుర్కొంటారు. ఇది ఆయనకు తెలియంది కాదు. అందుకే కేంద్ర బడ్జెట్ పై జగన్ నోరు తెరవ లేకపోయారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో ఉన్నారు. రేపు జంతర్ మంతర్ వద్ద ఏపీలో శాంతిభద్రతలు క్షీణించడం పై ఆందోళన చేయనున్నారు. కానీ అదే టిడిపి భాగస్వామ్యంగా కేంద్రంలో నడుస్తున్న.. ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఎటువంటి వ్యాఖ్యలు చేయకపోవడం విశేషం.ఏపీకి గతంలో ఎన్నడూ లేనంతగా కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణానికి ఏకంగా 15 వేల కోట్ల రూపాయలు కేటాయించింది. పోలవరం నిర్మాణానికి సైతం చివరి వరకు సాయం చేస్తామని ప్రకటించింది. వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయిస్తామని చెప్పింది. పూర్వోదయ ప్రాజెక్టు కింద కీలక నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తామని చెప్పుకొచ్చింది. దీనిని వైసీపీ ఆహ్వానిస్తే.. తన వైఫల్యాన్ని తానే ఒప్పుకున్నట్టే. పైగా చంద్రబాబు సర్కార్ కు మెచ్చుకున్నట్టే. అందుకే జగన్ మౌనంగా ఉన్నారు. వైసీపీ నేతలు సైతం బడ్జెట్ పై స్పందించడం లేదుఐదు సంవత్సరాలుగా కేంద్రం బడ్జెట్లను ప్రవేశపెట్టింది. కానీ ఎన్నడూ ఏపీకి ఆశాజనకంగా కేటాయింపులు చేయలేదు. విభజన హామీలకు పరిష్కారం దొరకలేదు.



## ఆదివారం అష్టమి సందర్భంగా దత్తాత్రేయ స్వామికి అనఘాష్టమి వ్రతం



కర్నూలు జిల్లా ప్రతినిధి జులై 24 విభారె న్యూస్..28-07-2024వ తేదీన శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందు ఆదివారం అష్టమి సందర్భంగా శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి అనఘాష్టమి వ్రతం నిర్వహించబడును. ఈ వ్రతం చేసుకోవడం వల్ల గురు బలం పెరుగుతుంది ఉద్యోగము, వివాహము లో ఆటంకాలు తొలుగుతాయి, విద్య బుద్ధులు కలుగుతాయి, వైవాహిక జీవితంలో సమస్యలు తొలగిపోయి, సకల కష్టాల నుండి విముక్తి పొంది స్వామివారి అనుగ్రహం కలుగుతుంది. అలాగే శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి దత్త ఫలం భక్తాదులు కట్టుకొని స్వామివారి సంపూర్ణ అనుగ్రహమును పొందగలరని కోరుకుంటున్నాము.అనఘాష్టమి వ్రతం ప్రధానముగా -1116/-సామూహికంగా -200/-సంకల్పం -116/-దత్త హోమం ప్రధానంగా:- 3500/- హోమ సంకల్పం:- 116/- వివరములకు సంప్రదించగలరు.9440533770దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777..

## శుక్రవారం షష్టి సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు..



కర్నూలు జిల్లా ప్రతినిధి జూలై 24 విభారె న్యూస్..26-07-2024 శుక్రవారం షష్టి సందర్భనీగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి విశేషమైన అభిషేకాలు, పూజలు, హోమాలు జరుగుతాయి..సంతాన సమస్యలు, వివాహ సమస్యలు, భూ సమస్యలు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈరోజు శ్రీ స్వామి వారిని ఆరాధించడం ద్వారా సమస్యల నుండి విముక్తి పొందవచ్చు. .మాసపూజ-300/-అభిషేకం-200/-సుబ్రహ్మణ్య హోమం -3,500/-సంప్రదించండి :-శ్రీధర్ శర్మ -7995202082దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు: 8896123777

## మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానుదారులకు శిక్షలు తప్పవు:జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా




-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24-డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం నేరం .ఎవరైనా వాహనదారుడు లేదా తల్లిదండ్రులు మైనర్లు అయిన తమ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వాహన యజమానులు, తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణమైతే అందుకు పూర్తి బాధ్యత వహనదారుడే వహించాల్సి ఉంటుందన్నారు. ప్రమాదానికి గురైనా ఇన్సూరెన్స్ పొందడంలో ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. కావున వాహనదారులు మైనర్లకు వాహనాలను ఇవ్వడంలో అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాలలను కాపాడండి - ఆప్టా..



కర్నూలు జిల్లా ప్రతినిధి జూలై 24 విభారె న్యూస్..ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని ప్రభుత్వ పాఠశాలల యందు విద్యార్థుల సంఖ్య సంవత్సరం నకు సంవత్సరమునకు గత ఐదు సంవత్సరాలుగా తగ్గుతూ వస్తోంది.దానికి ముఖ్య కారణం లు రెండు.ప్రభుత్వం 117 ఉత్తర్వులు ద్వారా 3,4,5 తరగతులు విలీనం చేయటం ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో 1,2 తరగతులు మాత్రమే వున్నాయి.అది కూడా ఒకరు లేక ఇద్దరు టీచర్ల తో మాత్రమే.ఈ విధంగా వున్నప్పుడు తల్లి తండ్రులు సాధారణంగా ఒకటి నుండి ఐదు తరగతులు వున్న ప్రవేటు పాఠశాల వె?పు చూస్తున్నారు.దానికి తోడు ప్రవేటు పాఠశాల వారు ధమాకా ఆఫర్ ఇస్తున్నారు. అమ్మ ఒడి డబ్బులు వచ్చినప్పుడు ఫీ కట్టండి. ఇప్పుడు పుస్తకాలు, మెటీరియల్ డబ్బులు మాత్రమే కట్టండి.ఈ విధంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో గణనీయంగా నమోదు తగ్గిపోతుంది. కాబట్టి మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ప్రభుత్వా ఉత్తర్వు లు 117 ను రద్దు చేసి వెంటనే 3,4, 5 తరగతులను మరల ప్రాథమిక పాఠశాలలోకి తరలించాలి.117లో మూడు కిలో మీటర్ల లోపల అని వున్నది. గత ప్రభుత్వ హయం లో ఒక కిలో మీటరు దూరంలో వున్న పాఠశాల లను విలీనం జరపగా వచ్చిన వ్యతిరేకత చూసి మూడు కిలో మీటర్ల దూరం పోలేదు.తల్లికి వందనం పథకం ను ప్రభుత్వ పాఠశాల లో చదివే వారికీ మాత్రమే అమలు పరచాలి. నెల వారి ప్రవేటు పాఠశాల ఫీజు లు కట్టడానికి సిద్ధపడి ప్రవేట్ పాఠశాల లో చేర్పించిన వారికి ప్రభుత్వ ప్రోత్సాహం ఇవ్వడం అనేది ఓట్ల రాజకీయం మాత్రమే,అది కూడా పని చేయలేదు అనే విషయం గత ఎన్నికల ఫలితాలు తెలిపాయి.తల్లికి వందనం అది కూడా ఒకసారి ఇవ్వకుండా ప్రభుత్వ పాఠశాలల్లో నెలవారీ విద్యార్థి హాజరు ఆధారంగా వారి ఖాతా లకు జమ అయ్యే విధానం లో అమలు చేయాలని తద్వారా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లను నమోదు పెరుగుతుంది. నేడు అసెంబ్లీ లో గౌరవ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఒక ప్రకటన చేస్తూ ప్రభుత్వ పాఠశాల తో పాటు ప్రవేటు పాఠశాల లో చదివే వారికి తల్లికి వందనం అమలు చేస్తాం అని చెప్పారు ఈ విషయం లో వారు పునరాలోచన చేయవలసినది గా ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ జి ఎస్ గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు పత్రిక ముఖంగా విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ నేతల ఒంటెద్దు పోకడల వలన అపశయ్య పై ఉన్న ప్రభుత్వ పాఠశాల లను కాపాడాలి అంటే తల్లికి వందనం పథకం ను ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వర్తింపచేయాలి అని వారు అన్నారు.

## మేలైన వ్యవసాయం-- పొలంబడిలో అవగాహన




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24- మేలైన వ్యవసాయం గురించి పొలం బడి లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం నంద్యాల మండలం చాబోలు గ్రామం నందు ఏడీఎ , రాజ శేఖర్ ఆధ్వర్యంలో "మేలైన వ్యవసాయ సాగు పద్ధతులతో పొలంబడి"నిర్వహించే కార్యక్రమం చాబోలు గ్రామంలో సభ నిర్వహించారు .ఈ సందర్భంగా ఏడీఎ రాజ శేఖర్ మాట్లాడుతూ నంద్యాల మండలం యందు ఖరీఫ్ 2024 కాలంలో వరి పంటలో మేలైన సాగు పద్ధతులతో పొలం బడి కార్యక్రమం నిర్వహించ బడును అని,ఈ పద్ధతులు అవలంభించి పంట సాగుచేయుట వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన రసాయనమందుల అవశేషాలు లేని దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. అదే విధంగా ఈ పద్ధతుల ద్వారా పండించిన పంటకు బహిరంగ మార్కెట్లో అధిక ధర పలుకుతాయని అన్నారు . మేలైన సాగు పద్ధతులతో పంట పండించే రైతుల యొక్క ఉత్పత్తులకు ప్రభుత్వం ద్వారా సర్టిఫికేట్ పొందే అవకాశం ఉందన్నారు , కావున గ్రామంలో రైతులు అధిక సంఖ్యలో పై పద్ధతులలో పంటలు సాగు చేయుటకు వారి గ్రామ వ్యవసాయ సహాయకుని వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నంద్యాల మండల వ్యవసాయ అధికారి ఇ. ప్రసాద రావు, మణి మోహన్ రెడ్డి సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 6 వార్డు లో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పర్యటన



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24-నంద్యాల టౌన్ 6 వార్డు ఇంచార్జ్ వల్లె వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన వార్డు పర్యటనలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని వార్డు అంతా పర్యటించి ప్రజల్ని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ జగజ్జనని నగర్ , ఆత్మకూరు బస్టాండ్ ఏరియా , ఫాతిమా మసీదు లైన్ లలో పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 6 వార్డు నందు రోడ్లు , కాలువలు , సీట్ లైట్లు సరిగ్గా లేవని ప్రజలు తెలియజేయడంతో వెంటనే అధికారులకు సమస్యలను తెలియజేసి వాటిని పరిష్కరించాలని కోరారు . అంతేకాకుండా నంద్యాల ప్రజలు వెంచర్ ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వెంచర్ లో స్థలం కొనేటప్పుడు వాటిలో రోడ్లు , కాలువలు , వాటర్ పైప్ లైన్లు సరిగ్గా ఉన్నాయా లేదో దాన్లకు ప్రభుత్వ అప్రూవల్ ఉందో లేదో తెలుసుకోవాలని సూచించారు . కొందరు భూ బకాసురులు వెంచర్లు వేసి అవిస్తాం ఇవిస్తం మా దగ్గర అన్ని సౌకర్యాలు ఉన్నాయని కల్లబొల్లి మాటలు చెప్పి తీరా స్థలాలు కొనుక్కున్న తర్వాత వాటికి రోడ్లు కాలువలు వీధిలైట్లు లేక ప్రజలు చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలియజేశారు . అంతేకాకుండా ఖాళీ స్థలాలలో మురికి నీరు నిలవ ఉండడంతో అక్కడ నివసించే ప్రజానీకానికి ఇబ్బందిగా మరియు వ్యాధులు సోకే అవకాశం ఉంది కాబట్టి ఎవరికైతే కాళీ స్థలాలు ఉన్నాయో వారు వెంటనే నీళ్ల నిలువ ఉండకుండా చూసుకోవాలని తెలియజేశారు . అనంతరం సమస్యలు విని సానుకూలంగా స్పందించిన ఎన్ఎండి ఫిరోజ్ గారికి 6 వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారుఈ కార్యక్రమంలో 6 వార్డు బూత్ కన్వీనర్లు తెలుగుదేశం పార్టీ నాయకులు , కార్యకర్తలు మరియు మున్సిపల్ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నంద్యాలలో కరెంటు షాక్ తో న్యాయవాది మృతి




నంద్యాల జిల్లా :24-07-2024 ,నంద్యాలలో కరెంటు షాక్ తో న్యాయవాది మృతి,స్నానం కోసం హీటర్ వేస్తూ కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన న్యాయవాది శివరాం,పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలింపు,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

## బదిలీపై వెళుతున్న జేసీ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వీడ్కోలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24-నంద్యాల జిల్లా నుండి బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వీడ్కోలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ల సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ దస్తగిరి పర్ల మేనేజింగ్ కమిటీ మెంబర్ ఉస్మాన్ భాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన అధికారి జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అని కొనియాడారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

## నూతన జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణాను కలసిన రెడ్ క్రాస్ నాయకులు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24-నంద్యాల జిల్లాకు నూతన ఎస్పీగా విచ్చేసిన ఆదిరాజ్ సింగ్ రాణాను నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కలిసి దుశ్శాలువ, పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి ఆయనకు వివరించగా, ఎస్పీ హైవే పెట్రోలింగ్ వారికి సిపిఆర్, ఫస్ట్ ఎయిడ్ పై శిక్షణ ఇవ్వాలని, మొబైల్స్ రావడం ద్వారా తప్పుడు బాటలు పడుతున్న విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సులు అత్యుత్తమ సమాజం కోసం నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ మారుతి కుమార్, జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఉస్మాన్ భాష, రోటరీ క్లబ్ మాజీ చైర్మన్ సుధా మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

### నూతన జాయింట్ కలెక్టర్ సీ. విష్ణు చరణ్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 24-: జిల్లాసంయుక్త కలెక్టర్ (జేసీ)గా నియమితులైన విష్ణు చరణ్ బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు జేసీగా రావడం సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ నేతృత్వంలో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయ నున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం సమ న్వయంతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలఅమలులోజిల్లాను ప్రథమ స్థానంలో ఉంచనున్నట్లు వివరించారు. సి. విష్ణు చరణ్ గతంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ గా పని చేసారు. ఇప్పుడు నంద్యాల జిల్లాకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన జేసీ కి పలు వురు జిల్లా అధికారులు అభినందనలు తెలిపారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190